మనం
నిజామాబాద్
కామారెడ్డి
గురువారం । 8 । మే । 2025
పేజీలు: 4





## అధికారులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించాలి


- అకాల వర్షాల వల్ల ధాన్యం తడిసి పోకుండా టార్పాలిన్ లను కొనుగోలు కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలి.
- కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

2



# పైసా కొట్టు.. పర్మిషన్ పట్టు!!

- అనుమతి కోసం ప్రైవేట్ విద్యాసంస్థల అడ్డదారులు
- నిబంధనలకు విరుద్ధంగా విద్యాసంస్థలో హాస్టళ్ల నిర్వహణ
- కనీస సదుపాయాలు లేకున్నా పర్మిషన్లు
- కళ్లు మూసుకుని అనుమతులిస్తున్న విద్యాశాఖ.



కామారెడ్డి, మే 07 ( మనం జిల్లా ప్రతినిధి ): మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతుంది విద్యశాఖ తీరు. ఏం చేసినా అడిగేవారు లేరనుకున్నారో ఏమో..? నిబంధనలు తమకు తప్ప ఇంకెవరికి తెలుసనుకున్నారో ఏమో..? జిల్లాలో ప్రైవేట్ విద్యాసంస్థల్లో కనీస వసతులు లేకున్నా కాసులు కురిపిస్తే చాలు కళ్లు మూసుకుని అనుమతులిచ్చేస్తున్నారు. పాఠశాలలు మరియు కళాశాల భవనాల్లో వసతి గృహాల నిర్వహణ నిబంధనలకు విరుద్ధమని తెలిసినా, చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తుంది ఈ విద్య శాఖ. అనుమతి లేకుండా కొనసాగుతున్న విద్యాసంస్థల విషయంలోనూ ఏమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ప్రైవేట్ యాజమాన్యాలు ధనార్జనే ధ్యేయంగా తూ తూ మంత్రంగా విద్యా సంస్థలు ఏర్పాటు చేసి, అర్హత లేని అధ్యాపకులచే విద్యను బోధిస్తూ

-మిగతా 2లో



సొంత ఇల్లు లేని నిరుపేదలకే

## ఇందిరమ్మ ఇళ్లు

- ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో ఎటువంటి రాజకీయలకు జోక్యం లేకుండా చూడాలి.
- అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఎంపిక చేస్తే కఠిన చర్యలు ఉంటాయి.
- బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి

కామారెడ్డి, మే 07 ( మనం జిల్లా ప్రతినిధి ):సొంత ఇల్లు లేని నిరుపేదలకే ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని, ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక లో ఎటువంటి రాజకీయలకు జోక్యం లేకుండా చూడాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే అధ్యక్షతన బాన్సువాడ నియోజకవర్గ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కొరకై గ్రామ, వార్డు ఇందిరమ్మ కమిటీ సభ్యులు మరియు సంబంధిత అధికారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో పోచారం మాట్లాడుతూ., సొంత ఇల్లు లేని నిరుపేదలకే ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఇంటిని మహిళల పేరు మీదే మంజూరు చేస్తారని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యుల ద్వారా పారదర్శకంగా ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని, ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక లో ఎటువంటి రాజకీయలకు జోక్యం లేకుండా చూడాలని సూచించారు. అలాగే జాబితాలో పేరు లేని వారు నిరాశ చెందవద్దని, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల రెండవ విడత ఎంపిక జరుగుతుందని, ఇది నిరంతర ప్రక్రియ అని తెలిపారు. ప్రతి గ్రామంలో అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు వచ్చేలా ఇందిరమ్మ కమిటీ సభ్యులు అందరూ కూర్చొని

-మిగతా 2లో

## రాళ్ళ వానకి నష్టపోయిన పంటకి నష్ట పరిహారం చెల్లించాలి

- అధికారులు పంట నష్టం పై నివేదిక ఇవ్వాలి
- కళ్ళములో తడిసిన సంచులను రైస్ మిల్లర్లు దించుకోవాలి
- త్వరగా కాంట పూర్తి చేయాలి
- తూకం వేసిన వడ్లు సాధ్యమైనంత తొందర రైస్ మిల్లులకు తరలించాలి
- కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణ రెడ్డి

2





## అధికారులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించాలి

**– అకాల వర్షాల వల్ల ధాన్యం తడిసి పోకుండా టార్పాలిన్ లను కొనుగోలు కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలి.**

**– కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**

కామారెడ్డి, మే 07 ( మనం జిల్లా ప్రతినిధి ): అధికారులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించాలని, అకాల వర్షాల వలన ధాన్యం తడిసి పోకుండా టార్ఫాలిన్ లను కొనుగోలు కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో పౌరసరఫరాలు, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, మార్కెటింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ., జిల్లాలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పౌర సరఫరాలు, సహకార, గ్రామీణాభివృద్ధి, ఆర్డీఓ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించాలని తెలిపారు. జిల్లాలో గత ఏడాది కన్నా ఇప్పటివరకు 134% ఎక్కువగా కొనుగోళ్లు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో 446 కొనుగోలు కేంద్రాలలో ఇప్పటివరకు 35161 రైతుల నుండి 257449.704 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని, ఇందులో దొడ్డు రకం ధాన్యం 107343.600 మెట్రిక్ టన్నులు, సన్నరకం 150106.104 మెట్రిక్ టన్నులు కొనుగోలు వేయడం జరిగిందని వివరించారు. ఇప్పటివరకు 597.28 కోట్ల రూపాయలు రైతులకు చెల్లించడం జరిగిందని, 9410 మంది రైతుల వద్ద నుండి 86331.520 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం నకు 43.17 కోట్ల బోనస్ చెల్లించడం జరిగిందని తెలిపారు. ఆకాల వర్షాల వలన ధాన్యం తడిసి పోకుండా ఉండేందుకు అన్ని కొనుగోలు కేంద్రాల్లో టార్ఫాలిన్ లు అందుబాటులో ఉంచాలని అన్నారు. జిల్లాలో అవసరమైన గన్నీ సంచులు అందుబాటులో ఉంచడం జరిగిందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలకు వస్తున్న ధాన్యమును త్వరగా కొనుగోలు చేసి ఎక్కువ కాంటా లు, ఎక్కువ మంది హమాలీలను ఏర్పాటుచేసి కొనుగోళ్ల వేగవంతం చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీఓ వీణ, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రాజేందర్, జిల్లా పౌరసరఫరాల అధికారి మల్లికార్జున్ బాబు, జిల్లా సహకార అధికారి రామ్ మోహన్, జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్, జిల్లా మార్కెటింగ్ అధికారిని రమ్య, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

### సొంత ఇల్లు లేని నిరుపేదలకే

## ఇందిరమ్మ ఇళ్లు

మొదటి పేజీ తరువాయి

నిర్ణయించాలని, అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఎంపిక చేస్తే కఠిన చర్యలు ఉంటాయని, ఒకటికి రెండు సార్లు పరిశీలించిన తరువాత ఇందిరమ్మ ఇళ్లు లబ్ధిదారుల ఎంపిక జరగాలని పేర్కొన్నారు. గ్రామ, వార్డుసభల్లో ఆమోదం పొందిన తరవాతే లబ్ధిదారులను కలెక్టర్ ఎంపిక చేస్తారని, లబ్ధిదారుల జాబితాను జిల్లా కలెక్టర్, జిల్లా ఇన్చార్జి మంత్రిని సంప్రదించి ఇంటిని మంజూరు చేస్తారని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ళు 400 చదరపు అడుగుల్లో ఇంటి నిర్మాణం చేపట్టాలని, కిచెన్, బాత్రూం ప్రత్యేకంగా ఉండాలి. ఆర్ సీసీ రూఫ్తో ఇంటిని నిర్మించాల్సి ఉంటుందని తెలిపారు. బాన్సువాడ నియోజకవర్గం మొత్తానికి గాను 3514 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రోస్ ఛైర్మెన్ కాసుల బాలరాజు, మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహత్, బాన్సువాడ నియోజకవర్గం లోని అన్ని మండలాల ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



# పైసా కొట్టు.. పర్మిషన్ పట్టు!!

మొదటి పేజీ తరువాయి

విద్యార్థుల తల్లిదండ్రుల ముక్కుపిండి రకరకాల ఫీజులు వసూలు చేస్తున్నారు.



**అనుమతి ఉంది కానీ వసతులు కరువు**

అనుమతి పొంది కొనసాగుతున్న విద్యాసంస్థల్లో కనీస వసతులు కరువయ్యాయి. నిబంధనల ప్రకారం స్కూళ్లలో, కళాశాలలో అన్ని సదుపాయాలు ఉన్నాయా..? లేవా...? అని నిర్ధారించిన తర్వాతే అనుమతి ఇవ్వాల్సిన విద్యాశాఖాధికారులు అవేమీ పట్టించుకోకుండా పర్మిషన్ ఇచ్చేస్తున్నారు. జిల్లాలో సగానికి పైగా పాఠశాలలు, కళాశాలలు కనీస సదుపాయాలు లేకుండానే కొనసాగుతున్నాయి. మరోపక్క ప్రైవేట్ విద్యాసంస్థల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు లేక విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదు.

**నిబంధనలపై నీళ్లు..!**

ప్రైవేట్ పాఠశాల మరియు కళాశాల నిర్వహించాలంటే.. ఒకటి కన్నా పై అంతస్తులుంటే గ్రిల్స్ ఏర్పాటు చేశారా..? లేదా..? అని అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాలి. జీవో నెం 29, తేదీ : 24.9.2020 ప్రకారం కళాశాల భవనం ఇచ్చిన నిబంధనలు పాటించాలి. ఎంట్రీ మరియు ఎగ్జిట్ దారులు ఉండాలి. శానిటరీ, అగ్నిమాపక అధికారులు జారీ చేసే సర్టిఫికెట్ విద్యాసంస్థ నిర్వహించే భవనం నాణ్యతను ధ్రువీకరించే సర్టిఫికెట్, మున్సిపాలిటీల్లో నిర్వహిస్తే.. మున్సిపల్ అధికారుల సర్టిఫికెట్, పాఠశాల, కళాశాల అద్దె భవనంలో నిర్వహిస్తే లీజ్, సొంత భవనంలో నిర్వహిస్తే ఓనర్షిప్ సర్టిఫికెట్లు నిశితంగా పరిశీలించాలి. అలాగే క్రీడామైదానం, ప్రయోగశాల, లైబ్రరీ, తాగునీటి వసతి, ప్రథమ చికిత్స, కంప్యూటర్ గది, సిబ్బంది గదులు, విద్యార్థినీ విద్యార్థులకు మూత్రశాలలు, మరుగుదొడ్లు కచ్చితంగా ఉంటేనే ఆ విద్యాసంస్థలకు అనుమతి ఇవ్వాలని జీవో నెం 1 చెబుతోంది. కానీ.. జిల్లాలో పాఠశాల, కళాశాలలో కనీసం మూత్రశాలలు లేకపోవడం, పెచ్చులుడుతున్న గోడలు ఉండటం విడ్డూరం. కొన్ని విద్యాసంస్థలో అయితే ఆ భవనాల పైనే సెల్ ఫోన్ టవర్లు ఉండటం విశేషం. అలాగే ఒకే భవనంలో తరగతుల నిర్వహణ, హాస్టల్ కొనసాగిస్తున్నారు. అందులోనే వంట, భోజన శాలలు నిర్వహిస్తున్నారు. ఏదైనా అగ్నిప్రమాదం జరిగినా, వంటగదిలో సిలిండర్ పేలినా విద్యార్థుల ప్రాణాలు గాలిలో కలవడం ఖాయం.

**లిస్ట్ లో ఒకరు, క్లాసులు చెప్పేది ఒకరు.**

పేరుకు మాత్రం విద్యాధికారులకు ఆయా సంబంధిత సబ్జెక్టుకి సంబందించిన సర్టిఫికెట్ కలిగిన అభ్యర్థి వివరాలు ఆన్లైన్ లో పొందపరచి, తరగతులు మాత్రం అర్హత లేని వారితో తక్కువ జీతాలు ఇచ్చి చెప్పించడం విడ్డురం. ఇదంతా కూడా విద్యాధికారులు వెరిఫికేషన్ చేయకుండా ఇష్టానూసారంగా అనుమతులు ఇవ్వడంతో విద్యార్థులు ఫెయిల్ కావడానికి కారణం అవుతుంది. ఇదంతా కూడా చేయి తడిపితినే ఫైలు కదులుతుంది. అనుమతి కూడా వచ్చేస్తుంది.

కామారెడ్డి జిల్లాలో పలు ప్రైవేట్ విద్యాసంస్థల్లో మౌలిక వసతులు.. పాటించాల్సిన నిబంధనలను 'మనం' క్షేత్రస్థాయిలో పరిశీలించగా ఆసక్తికర విషయాలు వెలుగులోకొచ్చాయి. ఇవే సమస్యలు జిల్లా వ్యాప్తంగా ఉన్నా, అధికారులు మాత్రం ప్రైవేట్ విద్యాసంస్థలపై అమిత ప్రేమ చూపుతున్నారని కొన్ని విద్యార్థి సంఘాలు విమర్శిస్తున్నారు.

ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఇన్ని సమస్యలున్నా.. విద్యాశాఖాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఇష్టానూసారంగా అనుమతులు ఇవ్వడం గమనార్హం. ఇప్పటికైనా అన్ని వసతులు ఉంటేనే పాఠశాలలకు గాని కళాశాలలకు గాని అనుమతులు ఇవ్వాలని పలు విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయంపై సరైన వసతులు లేక అనుమతులు పొందిన విద్యాసంస్థ యాజమాన్యానికి గాని అధికారులకు గాని ప్రశ్నించడానికి 'మనం' దిన పత్రిక సిద్ధంగా ఉంది.

### రాళ్ల వానకి నష్టపోయిన పంటకి

# నష్ట పరిహారం చెల్లించాలి

**– అధికారులు పంట నష్టం పై నివేదిక ఇవ్వాలి.**

**– కళ్ళములో తడిసిన సంచులను రైస్ మిల్లర్లు దించుకోవాలి.**

**– త్వరగా కాంట పూర్తి చేయాలి.**

**– తూకం వేసిన వడ్లు సాధ్యమైనంత తొందర రైస్ మిల్లులకు తరలించాలి.**

**– కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణ రెడ్డి.**



కామారెడ్డి, మే 07 ( మనం జిల్లా ప్రతినిధి ): మంగళవారం రాత్రి అకాల వడగళ్ల వాన కారణంగా నష్టపోయిన పంటను, కళ్ళేలల్లో తడిసిన వడ్లను కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణ రెడ్డి బుధువారం అడ్లూర్, చిన్న మల్లారెడ్డి, తలమడ్ల గ్రామాల్లో వడ్ల కళ్ళల వద్దకి వెళ్లి పరిశీలించి, రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వెంకట రమణ రెడ్డి మాట్లాడుతూ., మంగళవారం రాత్రి కురిసిన వడగళ్ల వాన వల్ల ఇంకా కోత కానీ వరి, మొక్కజొన్న పంటలు తీవ్రంగా నష్టపోయాయని, నష్టపోయిన పంటకి ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలనీ డిమాండ్ చేశారు. అధికారులు పంట నష్టం పై నివేదిక ఇవ్వాలనీ కోరారు. కళ్ళములో తడిసిన సంచులను రైస్ మిల్లర్లు దించుకోవాలనీ విజ్ఞప్తి చేశారు. అధికారులు సాధ్యమైనంత త్వరగా కాంట పూర్తి చేయాలనీ అన్నారు. తూకం వేసిన వడ్లు సాధ్యమైనంత తొందర రైస్ మిల్లులకు తరలించాలనీ అన్నారు.

# పర్మిషన్ నిల్.... ప్రచారం ఫుల్...

**- జిల్లా విద్యాశాఖ అధికారుల నుంచి ఎలాంటి పర్మిషన్ లేకుండా ప్రచారాలు కొనసాగిస్తున్న అభి ఇంటర్నేషనల్ ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం.**

**- అభి ఇంటర్నేషనల్ స్కూల్ మీద అనుమాతి లేకున్నా అనుమతులు వచ్చాయంటూ అడ్మిషన్లు, జోరుగా ప్రచారాలు.**

**- అసలు ఇది శ్రీ వెంకటసాయి విద్యానికేతన్ స్కూళ్ల అభి ఇంటర్నేషనల్ స్కూళ్ల అంటూ అయోమయంలో విద్యార్థులు వారి తల్లీ తండ్రులు.**

**- నసరుల్లాబాద్ మండల విద్యాధికారికి వినతి పత్రం అందచేస్తున్న (బీసీ.వి ఎస్) (ఏ.ఐ.ఎస్.బి) విద్యార్థి సంఘాల నాయకులు.**



కామారెడ్డి, మే 07 ( మనం జిల్లా ప్రతినిధి ): కామారెడ్డి జిల్లా బాన్సువాడ నియోజకవర్గంలోని నసరుల్లాబాద్ మండలం ఎక్స్ రోడ్ లో ఉన్న శ్రీ వెంకటసాయి విద్యానికేతన్ ప్రైవేట్ స్కూల్ ప్రభుత్వ అనుమతితో ఉన్నపటికి ఇప్పుడు అభి ఇంటర్నేషనల్ ప్రైవేట్ స్కూల్ అనుమతి వచ్చింది అంటూ అడ్మిషన్లు, ప్రచారాలు కొనసాగిస్తూనరాని బీసీ.విఎస్) బీసీ విద్యార్థి సంఘాం ఉమ్మడి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దత్తు (ఏ.ఐ.ఎస్.బి)) ఆల్ ఇండియా స్టూడెంట్స్ బ్లాక్ జిల్లా అధ్యక్షులు భైరపూర్ రవీందర్ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ., నసరుల్లాబాద్ మండలం కేంద్రంలో గల ఎక్స్ రోడ్ లో ఉన్న అభి ఇంటర్నేషనల్ స్కూల్ జిల్లా మండల విద్యాశాఖ అధికారులు నుంచి ఎలాంటి పర్మిషన్ లేకుండానే అభి ఇంటర్నేషనల్ స్కూల్ పేరుతో అడ్మిషన్లు ప్రారంబిస్తూ, ప్రచారాలు కొనసాగిస్తూ కరపత్రాలతో, హోర్డింగ్ లతో, ఫ్లెక్సీలతో విద్యార్థుల తల్లిదండ్రులను మబ్బపెడుతూ మోసం చేస్తున్నారని వారు అన్నారు. ఈవిషయంపై నసరుల్లాబాద్ మండల విద్యాశాఖ అధికారికి వివరణ కోరగా మండల కేంద్రంలోని అభి ఇంటర్నేషనల్ ఇ ప్రైవేట్ స్కూల్ కి ఎలాంటి పర్మిషన్ లేదని, మా విద్యాశాఖ కార్యాలయం నుండి ఆ స్కూల్ కి ఎటువంటి ధ్రువీకరణ ఇవ్వలేదని ఆయన చెప్పడం జరిగిందని వారు అన్నారు. అలాగే కామారెడ్డి జిల్లాలో కొన్ని ప్రైవేట్ స్కూల్ యాజమాన్యలు ఈ విద్యా సంవత్సరం పూర్తి కాకముందే అడ్మిషన్లు ప్రారంభం ఆయాయాని మరియు మరికొన్ని ప్రైవేట్ పాఠశాలలు ఇప్పటికే ప్రచారాలు మొదలుపెట్టాయని వాటిపై కూడా తక్షణమే జిల్లా విద్యాధికారూలు జిల్లా ఉన్నత అధికారులు చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో మా (బీసీ.వి ఎస్ ) (ఏ.ఐ.ఎస్.బి)) విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు ఉధృక్తం చేస్తామని వారు తెలిపారు.




## ఉపాధి హామీ పథకం క్రింద చేపట్టనున్న పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

కామారెడ్డి, మే 07 ( మనం జిల్లా ప్రతినిధి ):గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం క్రింద చేపట్టనున్న పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్



సాంగ్వాన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం క్రింద గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్వాడీ కేంద్రాలు, విద్యార్థినిల స్కూల్ టాయిలెట్స్, సి.సి.రోడ్లు, ఫామ్ పాండ్స్ ,తదితర పనులకు రెండు రోజుల్లో ఆయా సంబంధిత అధికారులు మండలాల వారీగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. గ్రామ పంచాయతీ, అంగన్వాడీ భవన నిర్మాణాలకు అవసరమైన భూములను గుర్తించాలని సూచించారు. ప్రతీ వారం ఆయా అధికారులతో సమావేశం నిర్వహించి సమీక్షించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చందర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా పంచాయతీ అధికారి మురళీ, జిల్లా సంక్షేమ అధికారిణి ప్రమీల, ఇంచార్జీ జిల్లా విద్యాశాఖాధికారి అశోక్, కామారెడ్డి, బాన్సువాడ పంచాయతీ రాజ్ ఈఈ లు దుర్గాప్రసాద్, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో అక్రమంగా నివసిస్తున్న వారిని సర్వే చేసి అరెస్ట్ చేయాలని కలెక్టరేట్‌లో వినతి

కామారెడ్డి టౌన్, మే 07 ( మనం న్యూస్ ): బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు జిల్లాలో అక్రమంగా నివసిస్తున్న పాకిస్తాన్, బంగ్లాదేశ్, రోహింగ్యాల విషయమై ప్రత్యేక సర్వే చేసి, కాటన్ సెర్చ్ నిర్వహించి అరెస్ట్ చేయాలని కామారెడ్డి జిల్లా కలెక్టరేట్ లో వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్న రాజులు మాట్లాడుతూ., ఇటీవల జమ్మూ కాశ్మీర్ లో జరిగిన ఉగ్రవాదుల దాడి అనంతరం జరిగిన పరిణామాల్లో భాగంగా పాకిస్థాన్ వారిని దేశం నుండి వెళ్ళిపోవాలని కేంద్ర ఆదేశించడం జరిగిందని, ఈ ఉత్తర్వులను కచ్చితంగా పాటించాలని, అదే విధంగా జిల్లాలో అక్రమంగా ప్రవేశించిన బంగ్లాదేశ్ వారిని, రోహింగ్యాలను గుర్తించి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో అక్రమంగా నివసిస్తున్న పాకిస్తాన్, బంగ్లాదేశ్, రోహింగ్యాల విషయమై ప్రత్యేక సర్వే చేసి, కాటన్ సెర్చ్ నిరవించి అరెస్ట్ చేయాలని బీజేపీ కామారెడ్డి జిల్లా శాఖ తరుపున కలెక్టర్ కి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ కుంటా లక్ష్మారెడ్డి, కామారెడ్డి పట్టణ అధ్యక్షుడు మోటూరి శ్రీకాంత్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు నంది వేణు, మైనారిటీ మోర్చా అధ్యక్షుడు నేహాల్, నాయకులు నరేందర్, వెంకట, సురేష్, రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.



# సిఐటియు నిరంతర పోరాట ఫలితమే జీవో నెంబర్ 306

**- పోరాడి సాధించుకున్న మినీ అంగన్వాడీ టీచర్లు.**

**- సిఐటియు జిల్లా అధ్యక్షుడు కే చంద్రశేఖర్.**

కామారెడ్డి టౌన్, మే 07 ( మనం న్యూస్ ): సిఐటియు నిరంతర పోరాట ఫలితమే జీవో నెంబర్ 306 విడుదల అని, మినీ అంగన్వాడీ టీచర్స్ ను మెయిన్ అంగన్వాడీ టీచర్స్ గా అప్డేట్ చేయాలని రాష్ట్ర మంత్రులు, అధికారులు, ఎంపీలు ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు సమర్పించి సిఐటియు ఆధ్వర్యంలో ఏప్రిల్ 24 న కలెక్టర్ కార్యాలయాల ముందు ధర్నాలకు డైరెక్టరేట్ కార్యాలయం ముట్టడికి నిరంతరం చేసిన పోరాటాల ఫలితంగానే రాష్ట్ర ప్రభుత్వం మినీ అంగన్వాడీ టీచర్స్ ను మెయిన్ అంగన్వాడీ టీచర్స్ గా అప్ గ్రేడ్ చేస్తూ 306 జీవోను విడుదల చేసిందన్నారు. పోరాడి విజయం సాధించిన నాలుగువేల మంది మినీ అంగన్వాడీ టీచర్లకు అభినందనలు తెలిపారు. వారికి అండగా నిలబడ్డ



మెయిన్ అంగన్వాడీ టీచర్స్ హెల్పర్స్ అందరికీ ధన్యవాదాలు తెలిపారు.

జీవోలో 12 నెలల పెండింగ్ వేతన బకాయిల పైన రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదని తక్షణమే స్పష్టత ఇవ్వాలన్నారు. 12 నెలల పెండింగ్ వేతన బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని, పెండింగ్ వేతనాలకు సరిపడా బడ్జెట్ను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

అప్డేట్ చేసిన మినీ అంగన్వాడి కేంద్రాలకు ఆయాలను కూడా కేటాయించాలని కోరారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి మరియు మంత్రి సీతక్కకు సిఐటియు జిల్లా కమిటీ తరఫున ధన్యవాదాలు తెలియజేశారు.

# మైనారిటీ గురుకుల విద్యార్థులను సన్మానించిన జిల్లా కలెక్టర్

కామారెడ్డి, మే 07 ( మనం జిల్లా ప్రతినిధి ): విద్యార్థులు ఇష్టంతో చదివి ఉత్తమ జీవితానికి బాట వేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. కామారెడ్డి జిల్లాలో మైనారిటీ గురుకుల విద్యార్థులు ఇటీవల ప్రకటించిన పదవ తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన, రాష్ట్ర స్థాయిలో ర్యాంకులను సాధించిన విద్యార్థులను బుధవారం తన ఛాంబర్ లో సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ., విద్యార్థులు సాధించిన ఉత్తమ విజయాలతో స్ఫూర్తి పొంది ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ విజయాలకు కారకులైన జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి, ఆర్.ఎల్.సి., ప్రిన్సిపాల్, అధ్యాపక, ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. జిల్లా మంచి పేరు తీసుకోవచ్చినందుకు వారి సేవలను కొనియాడారు. కామారెడ్డి మైనారిటీ జూనియర్ కళాశాల విద్యార్థులు రెండవ సంవత్సరం బిపిసి లో జబ్రాన్ అలీ 991/1000 మార్కులతో రాష్ట్ర స్థాయి 7 వ ర్యాంక్, ఆఫ్రోజ్ 987/1000 మార్కులతో 11 వ ర్యాంక్ సాధించారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో బీపీసీ బాన్సువాడ జూనియర్ కళాశాల విద్యార్థులు తవూర 435/440 మార్కులతో రాష్ట్ర 4వ ర్యాంక్, ఆఫ్తాబ్ 432/440 మార్కులతో రాష్ట్ర స్థాయి 7 వ ర్యాంక్ , ఎంపీసీ లో సాత్విక, రాంచరణ్ 461/470 మార్కులతో రాష్ట్ర 7వ ర్యాంక్ సాధించారని వివరించారు.

పదవ తరగతి విద్యార్థులు నిక్షయ్ 581/600, రాహుల్ 575/600 మార్కులు సాధించిన విద్యార్థులను కలెక్టర్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి దయానంద్, ఆర్.ఎల్.సి. కిరణ్ గౌడ్, ప్రిన్సిపల్స్ ఇంతియాజ్ అలీ, వెంకటరాములు, ధనలక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.





# భూ సర్వే చేసి పూర్తి వివరాలను పక్కాగా సేకరించి పరిశీలించాలి

**- కామారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ రెవిన్యూ వి. విక్టర్**

కామారెడ్డి, మే 07 ( మనం జిల్లా ప్రతినిధి ):భూ భారతి చట్టం ప్రకారం భూ సర్వే చేసి పూర్తి వివరాలను పక్కాగా సేకరించి పరిశీలించాలని అదనపు కలెక్టర్ రెవిన్యూ వి. విక్టర్ అన్నారు. బుధవారం లింగంపేట్ మండలం నల్లమడుగు, పోతాయిపల్లి గ్రామాలలో భూ భారతి సర్వే టీమ్ లు క్షేత్ర పర్యటన చేసి సర్వే భూ వివరాలు, పాసు పుస్తకాల కోసం దరఖాస్తు చేసుకున్న వాటి వివరాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ., ఏళ్ల తరబడి సాగుచేస్తున్న భూ వివరాలను సంబంధిత రెవిన్యూ సిబ్బందిని అడిగి తెలుసు కున్నారు. చట్టం ప్రకారం భూముల వివరాలు సేకరించాలని, సేకరించిన వివరాలను డెస్క్ వర్క్ చేయాలనీ సూచించారు. ప్రతీ విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. అనంతరం లింగంపేట్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ను అదనపు కలెక్టర్ సందర్శించి, కొనుగోళ్ల వివరాలు, రైతుల వివరాలు, కేంద్రాల్లో వసతుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం ను త్వరగా తూకం వేసి రైస్ మిల్లులకు తరలించాలని కేంద్రం నిర్వాహకులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ, పౌరసరఫరాల అధికారులు, కేంద్రం నిర్వాహకులు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పాస్ పోర్ట్ వెరిఫికేషన్లో నిర్లక్ష్యంగా వ్యవహారించిన హెడ్ కానిస్టేబుల్ సస్పెండ్..

కామారెడ్డి క్రైమ్, మే 07 ( మనం న్యూస్ ): పాస్పోర్ట్ వెరిఫికేషన్ సమయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ కృష్ణను సస్పెండ్ చేస్తూ ఇన్చార్జి డీఐజీ సన్ప్రీత్సింగ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణ స్పెషల్ బ్రాంచ్లో హెడ్ కానిస్టేబుల్ పనిచేస్తున్న సమయంలో టేకుల రాజయ్య పాస్పోర్టు దరఖాస్తు విచారణకు వచ్చింది. విచారణ సమయంలో కనీస ప్రాథమిక పరిశీలన చేయకుండానే కృష్ణ క్లియరెన్స్ ఇచ్చారు. అయితే రాజయ్యకు అంతకుముందే రాజు అనే పేరుపై పాస్పోర్టు ఉంది. విచారణ చేయకపోవడంతో కృష్ణ ఈ విషయాన్ని గుర్తించలేదు. అయితే తర్వాత శంషాబాద్ ఎయిర్పోర్ట్లో రాజయ్యపై రెండు పాస్పోర్టులు కలిగి ఉన్నందుకు కేసు నమోదైంది. ఈ విషయంలో హెడ్ కానిస్టేబుల్ నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఎస్పీ రాజేశ్ చంద్ర ఇన్చార్జి డీఐజీకి నివేదిక పంపించారు. దీంతో ఆయనను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని, సిబ్బంది పనితీరుపై నిరంతరం నిఘా ఉంటుందని ఇన్చార్జి డీఐజీ హెచ్చరించారు.